# మంచి వార్త

## బాటిల్ వాటర్ ఫిల్టర్

**శుద్ధమైన** నీరు తాగడం అందరి హక్కు! కానీ, నేటికీ వేలాది గ్రామాలు మంచినీళ్ల కోసం పరితపిస్తున్నాయి. జీవనదుల్లో లక్షల టీఎంసీల నీళ్లు ప్రవహిస్తున్నా.. ఒడ్డున ఉన్న పల్లెల్లో మాత్రం శుద్ధమైన నీటికి కటకటే! అందుకే ఊరూరా ఆర్వో ప్లాంట్లు పుట్టుకొస్తున్నాయి. ఈ సమస్యకు పరిష్కారంగా తనవంతు ప్రయత్నం చేశాడు కర్ణాటకలోని బెల్గామ్‌కు చెందిన నిరంజన్ కరాగి. దేశంలోనే అతిచిన్న, అతి చౌకైన వాటర్ ఫిల్టర్‌ను ఆవిష్కరించి.. అందరికీ స్వచ్ఛమైన మంచినీళ్లు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నాడు. నిరంజన్ సృష్టించిన ఫిల్టర్.. వాటర్ బాటిల్‌లో ఇమిడిపోతుంది. సీసాలో నీళ్లు పోస్తే చాలు.. ఫిల్టర్ నుంచి వచ్చే నీళ్లు శుద్ధంగా, స్వచ్ఛంగా మారిపోతాయి. ఈ ఫిల్టర్ తయారీ వెనుక ఆసక్తికరమైన కథ ఉంది. నిరంజన్ ఇంటికి సమీపంలో ఓ ప్రభుత్వ పాఠశాల ఉండేది. బడిలో చాలామంది విద్యార్థులు తరచూ అస్వస్థతకు గురవుతున్నారన్న విషయం కూడా అతని దృష్టికి వచ్చింది. ఆరా తీస్తే కలుషితమైన నీటిని తాగుతుండటం వల్లే ఆ పిల్లలు రోగాల బారిన పడుతున్నారని తెలిసింది. అప్పటికే ఇంజినీరింగ్ చదువుతున్న నిరంజన్ ఈ సమస్యకు తానే ఒక పరిష్కారం చూపాలని అనుకున్నాడు. అది తాత్కాలికమైనది కాకుండా.. శాశ్వతమైనదిగా ఉండాలని భావించాడు. తక్కువ ఖర్చులో వాటర్ ప్యూరిఫైయర్‌ను రూపొందించడానికి అహరహం శ్రమించాడు. తను తయారుచేసే ఫిల్టర్.. వాటర్ బాటిల్‌లో అమరిపోయే విధంగా ఉండాలనుకున్నాడు. రకరకాల ప్రయోగాల తర్వాత ఓ వాటర్ ఫిల్టర్ నమూనాను సిద్ధం చేశాడు. నెలల తరబడి విజయవంతమైన ప్రయోగాలు చేసి ఆ ప్యూరిఫైయర్‌కు పేటెంట్ తీసుకున్నాడు. దానికి ఆధునిక సాంకేతిక జోడించి ఇప్పుడు అందుబాటులో ఉన్న మాడల్‌ను సిద్ధం చేశాడు. దానిని నిర్మల్ అనే స్టార్టప్ వేదికగా రూ.300కే విక్రయిస్తున్నాడు. ఎంతటి కలుషిత జలాన్నైనా ఈ ఫిల్టర్ ఇట్టే శుద్ధి చేస్తుంది. పల్లెలు, పట్టణాలకు వెళ్లి తన వాటర్ ఫిల్టర్‌ను ప్రమోట్ చేశాడు. అలా ఇప్పటి వరకు లక్షల వాటర్ ప్యూరిఫైయర్లను విక్రయించాడు నిరంజన్. నిమిషాల వ్యవధిలో నీటిని శుద్ధి చేసే ఈ అద్భుతమైన ఆవిష్కరణను nirnal.in నుంచి కొనుగోలు చేయవచ్చు.



## వైతాళికుల వాణి

ఒకరు విజయాన్ని సాధించారు అంటే, వేరొకరు కూడా ఆ విజయాన్ని సాధించగలరు అని నిరూపణ అయినట్టే.

• అబ్రహం లింకన్

## క్యా సీన్ హై!

